# సంబంధం

"మనుషులు సంబంధాలు ఎందుకు తెంపుకొంటారు? ఎందుకు కలుపుకొంటారు? సంబంధాలన్నీ అవసరాల కోసమేనా? ఏ అవసరం లేకపోతే సంబంధమే అక్కరలేదా? మనిషై పుట్టాక పరిచయాలను అనుబంధం, ఆత్మీయతల్తో పెంచుకోకపోతే ఆ జన్మ ఎందుకు? థూ..." అని లోలోన విసుక్కుంటూ పావుగంట సేపు అవతల్నించి కరుణాకర్ చెప్పిందానికల్లా సరేనంటూ ఫోన్ పెట్టేసి ఊపిరి పీల్చాడు ఎల్లయ్య.

కరుణాకర్‌కు తాను ఇపుడు గుర్తొచ్చాడా! అదైనా అతని కూతురుకు సంబంధం చూడ్డం కోసం అకస్మాత్తుగా ఇరవై ఏళ్ల తరవాత ఫోన్ చేస్తే ఎవరోలే అనుకుని తెల్సినవాడేనన్నట్టు కాసేపు మర్యాద కోసం ఊకొట్టాడు. మధ్యలో ఎక్కడో క్లూ దొరికింది. గుర్తొచ్చాడు.

అతని అవసరం తనకు ఫోన్ చేయించిందే తప్ప స్నేహంతో కాదు. పాత స్నేహితుడు అతనికి ఇలా అవసరం కోసం గుర్తొచ్చాడు. అలానైనా గుర్తొచ్చినందుకు ఓ పక్క సంతోషం. పరిచయాన్ని అవసరానికి వాడుకోవడానికి గుర్తించినందుకు బాధ. అందరికీ అవసరం పడే స్థాయిలో ఉంటే సంబంధాలన్నీ అనుబంధాలుగా రూపుదిద్దుకుంటాయి అని బతుకు రహస్యం తెల్సి టీచర్స్ యూనియన్‌లో చురుకుగా తిరుగుతున్నవాడే తాను.

బడికి ఆలస్యం అవుతుందని ఆలోచనల్లో మర్చిపోయాడు ఎల్లయ్య. కరుణాకర్ కన్నా అతను చెప్పిన పిల్లవాడి తండ్రి లెక్చరర్ పురుషోత్తమే తనకు ఎక్కువ సన్నిహితుడు. సంబంధంలో మధ్యవర్తి పెద్దమనిషిగా ఉండాల్సి వస్తే పురుషోత్తం తరఫునే ఉండాలి. కరుణాకరేమో తన తరఫునే ఉండమంటాడు. అతని గురించి తనకు తెల్సిందేమీ లేదు. వాళ్లు అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లు ఎంతమంది? ఎవరు ఏం చేస్తుంటారు? అమ్మాయిని చూశావా! ఎలా ఉంటుంది? ఇరవై యేళ్ల తరవాత ఫోన్ చేసినవాడి గురించి ఎలాంటివాడని అంటే ఏమని చెప్పడం?

ఫోన్లో కరుణాకర్ చెప్తుంటే గజిబిజిగా రాసుకున్న అమ్మాయి వివరాల్ని మళ్లీ తెల్ల కాగితం మీద ఫేర్‌గా బయోడేటాగా రాశాడు ఎల్లయ్య. ఎప్పటి పని అప్పుడే చేయకపోతే పనుల ఒత్తిడిలో మర్చిపోతానని అతని భయం. వెంటనే పురుషోత్తంకు ఫోన్ చేశాడు. అతని భార్య సునంద ఫోన్ ఎత్తినట్టుంది.

"అక్కా! బావ ఉన్నాడా!" అని అడగడంతో కార్డులెస్ ఫోన్తో పురుషోత్తం లైన్లోకొచ్చాడు. అదీ ఇదీ ముచ్చటించుకున్నాక కరుణాకర్ ఇచ్చిన వివరాలన్నీ చెప్పాడు ఎల్లయ్య. అన్నీ విన్నాక అన్నాడు పురుషోత్తం-

"నీకే ఇరవై ఏళ్ల తరవాత ఫోన్ చేసినవాళ్ల ఫ్యామిలీ బ్యాగ్రౌండ్ గురించి మనకేం తెలుస్తుంది- వాళ్లు చెప్పింది వినడం తప్ప! ఆదివారం వస్తానన్నాడంటున్నావు గదా- వచ్చాక చూద్దాం. అయినా మా వాడికి వెంటనే పెళ్లి చేసే ఆలోచన లేదు. నీకు తెల్సు గదా! స్టేట్స్‌కు పోయి ఓ ఏడాది ఉండి వచ్చాక చేద్దామనుకుంటున్న. ఆ మాట చెప్పకపోయినవా?"

"ఆయన నన్ను మాట్లాడనిస్తే గదా బావా! కుండలకొద్దీ ఫోన్లోనే ప్రేమ ఒలకబోసుకుంటూ ఒకటే సంపుడు. పాపం ఆడపిల్ల తండ్రి అవస్థలు చూడు" అంటూ నవ్వాడు ఎల్లయ్య. ఫోన్ పెట్టేసి వాచీ చూసుకొని లేటైపోయె అనకుంటూ గబగబా ఇంత తిని పగటి భోజనం బాక్సు తీసుకొని బస్టాండుకేసి నడిచాడు ఎల్లయ్య. బస్సులో కరుణాకర్ గురించే ఆలోచిస్తున్నాడు.

కరుణాకర్ ఉద్యోగం దొరక్క ముందు ఎంత డీలాగా ఉండేవాడు! ఎంత ప్రేమ ఒలకబోసేవాడు! ఉద్యోగం దొరికాక ఎంత సంతోషంగా ఉన్నాడు. ఎంత మంచివాడో అన్పించుకోవడానికి పండుగలకు పబ్బాలకు రెగ్యులర్‌గా ఎలా కలిసేవాడు. ప్రమోషన్ వచ్చి ఆఫీసర్ అయ్యాక ఏడాది తిరిగేసరికల్లా ఎలా మారిపోయాడో... నిజానికి తనకు అప్పట్నించే అతనితో అక్కర మొదలైంది. తనదీ అతనిదీ వేర్వేరు డిపార్ట్‌మెంట్లు అయినా ఓ డిస్ట్రిక్ ఆఫీసరు మన ఫ్రెండు అని రొటీన్‌గా చెప్పుకుంటే జరిగే పనులు కాస్తా హుందాతనంతో జరుగుతాయి. సమాజంలో కాస్తా స్టేటస్‌గా వుంటుంది అనుకున్నాడు తాను. సరిగ్గా వాటిని నిరాకరించడానికే అతను డీ-లింక్ అయ్యాడని తనకు తెలుసు. కాని అవసరం తనది.

హైదరాబాద్‌కెళ్లినప్పుడు ఆ రోజు తాను ఆఫీసు అయిపోయే సమయానికి కరుణాకర్‌ను కలిశాడు. మాట్లాడుకుంటూ కరుణాకర్ ఇంటికి వెళ్లి అతని ఇంట్లోనే

భోంచేసి పడుకుందా మనుకున్నాడు. కరుణాకర్ అది గమనించి ఆఫీసు గేటు బయటే మాట్లాడి, పనుంది అంటూ వెళ్లిపోయాడు. మొదటిసారిగా తన హృదయం కలుక్కుమంది. తనకు తిండికి లేకనా అతనింటికి వెళ్లాలనుకున్నది? అతనింటికి వెళ్లాలంటే ఆటో ఛార్జీలే తడిసిమోపెడు అవుతాయి. ఆటోలకు పెట్టే పైసల్తో రెండు సార్లు హోటల్లో భోంచేయవచ్చు. కాకపోతే పాత స్నేహితుణ్ని కల్సినట్టు ఉంటుంది. ఆటో ఛార్జీల కోసం చూడకూడదనుకున్నాడు. ఆ రోజు నుంచి మళ్లీ కరుణాకర్ ఇంటి మొహం చూడలేదు తాను.

అప్పుడప్పుడు మనసు ఉండబట్టలేక కరుణాకర్‌కు ఉత్తరాలు రాసేవాడు. ఎన్నిసార్లు రాసినా జవాబు రాకపోవడంతో విసుగొచ్చేది. ఉత్తరాలు రాసేన్ని విశేషాలేమీ లేకపోతే నూతన సంవత్సర శుభాకాంక్షలో, ఉగాదో, దసరో, దీపావళో, ఏదో ఒక పేరు మీద గ్రీటింగ్స్ అయినా పంపితే సంబంధం కొనసాగి ఉండేది. తాను పంపితే కనీసం రిప్లై లేదు. ఆ తరవాత ఓసారి 'ఆ అడ్రసులో లేదు' అని ఉత్తరం వాపసు వచ్చింది. అడ్రసు మారినప్పుడైనా ఏదో గ్రీటింగ్స్ పేరుతో కొత్త అడ్రస్ అందరికీ పోస్టు చేయొచ్చు గదా. ఆఫీసర్‌గా ఉద్యోగం చేసేవాడికి ఇవేవీ తెలియవనుకోవడం ఎలా? కావాలనే తనలాంటివాళ్లను వదిలించుకున్నాడు. ఇన్నాళ్లకు ఇప్పుడు తన అవసరం పడింది. లోలోన భలే సంతోషం కలిగింది.

తరవాత తెలిసింది. అతని నీతినిజాయితీ కబుర్లన్నీ గాలికెగిరిపోయాయని, అవినీతిపరుల చిట్టాలో కరుణాకర్ టాప్‌టెన్‌లో ఉంటాడని, ప్లాట్లు వగైరా ఏవేవో బాగానే కొన్నాడని, ఎప్పుడో ఎవరో ఏదో అంటూ ఉండేవారు. అలాంటివాడు తన పాత స్నేహితుడని చెప్పుకుంటే పరువుపోతుందని వినీవిననట్టు తాను ఉండేవాడు. నీ పాత స్నేహితుడు ఎలా అయ్యాడో చూశావా అని ఎవరైనా అడిగితే తనకు తెలియదని తప్పించుకున్నాడు.

అతను అవినీతితో డబ్బు బాగా కూడబెట్టాడు. పిల్లల్ని హైస్కూలు స్థాయి నుంచే రెసిడెన్షియల్ స్కూల్స్‌లో వేలు పోసి చదివించాడు. డబ్బూ, హోదా, సుఖం ఎక్కువై, పిల్లలు గర్విష్టులుగా మారి తమ క్లాస్‌మేట్స్‌తోనైనా సరిగ్గా ఉండేవారు కాదు. చదువు పట్ల నిర్లక్ష్యం, తండ్రి హోదాతో, డబ్బుతో అంది వచ్చిన ఇతర విషయాల పట్ల ఎనలేని ఆసక్తి. లేకపోతే ఈపాటికి ఇంజనీరింగ్ అయిపోయి ఫారిన్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తూ తమకు అజాపతా తెలియకుండా పోవాల్సిన స్థాయి వాళ్ల పిల్లలది. ఉట్టి ఎమ్మెస్సీ చేసిందంటే అమ్మాయి లాంగ్‌టర్మ్ కోచింగ్‌తోనైనా

ఎంసెట్లో పేమెంటు సీటైనా తెచ్చుకోలేదనే కదా? ఏమో ఆ అమ్మాయి ఎలా పెరిగిందో.. ఆమె స్వభావం ఏమిటో ప్రణాళికాబద్ధంగా క్రమశిక్షణాయుతంగా జీవిస్తున్న పురుషోత్తం వంటివాళ్ల ఇంటి కోడలైతే ఆ అమ్మాయి నెగలకనైనా పోవాలి లేదా పెళ్లయ్యాక కొడుకు తండ్రితో పూర్తిగా విడిపోయి ఆ అమ్మాయికే సంపాదనంతా ధారపోయాలి. పురుషోత్తం ఇది సహిస్తాడా?

కులం ఒకటే అయింది కాబట్టి సంబంధం ఒకటి తన ద్వారా ఉంది కాబట్టి ఇరవై యేళ్లకైనా ఫోన్ చేశాడు కరుణాకర్. తమ కులంలో మగపిల్లలను చదివించడమే కష్టంగా వుంది. ఆడపిల్లలను పీజీల దాకా ఎవరు చదివిస్తున్నారు? చదివిస్తే మంచి పొజిషన్‌లో వుండే పెళ్లి కొడుకులు దొరకాలంటే మరెంత కష్టం! అందుకని కులాలవారీగా వధూవరుల పరిచయ వేదికలు పెడుతున్నారు. గుర్తు పట్టలేకుండా పోయిన ఈ కులాలను గుర్తు పెట్టుకోవడానికి కాకపోతే ఈ కులసంఘాల వధూవరుల పరిచయవేదికలకు అర్థమేమిటట! అక్కడా అనుమానాలే. ఎవరి జీవిత నేపథ్యం ఏమిటో పరస్పరం తెలియక అయోమయం. మళ్లీ పుట్టి పెరిగిన ఊళ్ల వైపు జిల్లాల వైపు దృష్టి సారించడం... హైదరాబాద్ పెళ్లి సంబంధాలు జగిత్యాలలోనో, కోరుట్లలోనో, మెట్‌పల్లిలోనో సెటిల్ కావడం విచిత్రం.

అబ్బాయి హైదరాబాద్‌లోనే ఉంటాడు. అమ్మాయీ హైదరాబాద్‌లోనే ఉంటుంది. కానీ పెళ్లి సంబంధం మాత్రం జగిత్యాల పాత బంధువుల ద్వారా సెటిలవుతుంది. ఉద్యోగాల్లో ఎదిగినా, ఆర్థికంగా ఎదిగినా, ఉమ్మడి కుటుంబాలు పోయి వ్యక్తి కుటుంబాలు వచ్చాక ఉన్న ఊరితో సంబంధం పోతే మనిషికి మరే సంబంధమూ మిగలకుండా పోతున్నది కాబోలు. కాకపోతే ఇన్నేళ్ల తరవాత కరుణాకర్‌కు తాను గుర్తు రావడం ఏమిటి? ఒకే కులం కాకపోయినా, ఏ సంబంధం తన ద్వారా లేకపోయినా ఆయనకు తనను కలిసే అవసరమే లేదు. అలా ఎంతమంది స్నేహాలు సంబంధాలు కొనసాగించక శిథిలమై పోయాయో.

'కొంచెం జరగండి' అనడంతో అతనికేసి చూశాడు ఎల్లయ్య. కాస్త జరిగాడు. ముగ్గురు కూర్చునే సీట్లో నలుగురు కూర్చోవడం ఇబ్బందిగా ఉంది. పైగా మధ్యనున్న బొర్ర ఇద్దరి స్థలం ఆక్రమిస్తుంది. తను చోటిచ్చినతన్ని ఎక్కడో చూసినట్టు అన్పించింది. భాస్కర్ కదూ. తనకన్నా స్కూల్లో మూడేళ్ల జూనియర్. ఆ మధ్య కొంతకాలం మండలాధ్యక్షుడుగా చేశాడు. వీడికి భలే సీలుగుడు. సీనియర్లని జూనియర్‌లు విష్

చేయడం సంప్రదాయం. వీడి జన్మలో ఒక్కనాడూ తనను నమస్తే అని పలకరించి ఎరగడు. పోనీ అని తానే అప్పుడప్పుడు హలో అనేవాడు. దానికి వాడే పెద్దవాడయినట్టు తానే చిన్నవాడినన్నట్టు ముసిముసిగా నవ్వి 'హలో' అనేవాడు. ఏం చూసుకొని వీడికి ఇంత గర్వమో! కులమో, పెయ్యి మీది చెత్తనో...! మండలాధ్యక్షుడయ్యాక హలో అంటే ఓసారి మొహం చిట్లించాడు. అంటే వీడికి తానే నమస్తే పెట్టాలన్నమాట. వీడు చేసిన తప్పుడు పనులెన్నో. వాడికేసి చూడ్డమే మానేశాడు. కొద్దికాలంలోనే ఇద్దరూ అపరిచితుల్లా అయిపోయారు. వీడితో తనకు పడే పనేమీ లేదు. యూనియన్ రీత్యా తానే అతడికన్నా పైస్థాయిలో ఉంటాడు. ఇప్పుడు వీడికి తెల్సు. తాను ఎవరైందీ. మాట్లాడించడానికి మొహం చెల్లడం లేదు.

అలా అనుకుని ఎల్లయ్య కూడా భాస్కర్‌కేసి అపరిచితుడిలా గంభీరంగా చూశాడు. 'సంబంధాలు' ఎంత విచిత్రంగా తెగిపోతాయో. 'అహం' ఎన్ని ఆప్యాయతల్ని, ఆత్మీయతల్ని మింగేస్తుందో. దానికి ఇంకెంత ఆహారం కావాలో మనుషుల్ని నమిలి మింగడానికి అనుకున్నాడు ఎల్లయ్య.

స్కూల్లో మధ్యాహ్నం లంచ్‌టైంలో స్టాఫ్‌రూమ్‌లో భోజనం బాక్సు విప్పి తన స్నేహితుడైన కొలీగ్ రాజేశ్వర్‌తో కరుణాకర్ విషయం చెప్పాడు ఎల్లయ్య.

"మనుషులు ఎలా ఉంటారో చూడు రాజేశ్వర్" అన్నాడు ఎల్లయ్య.

"బాగా సంపాదించిండంటున్నారు, మీ కొడుక్కే అడగవచ్చు గదా సార్" అని రొటీన్‌గా అలవోకగా అన్నాడు రాజేశ్వర్.

ఎల్లయ్య ఆశ్చర్యపోయాడు. తనకెందుకింతదాకా ఈ ఆలోచన రాలేదు? సామాజిక విలువలు మనిషి ఆలోచనల్ని ఎలా నియంత్రిస్తాయో! కరుణాకర్ హోదా, ఐశ్వర్యం అతని ధనిక సంస్కృతికీ తనకూ ఏ సంబంధం లేదని తన మనసులో ఉండడం వల్లనే కదా తనకా ఆలోచన రానిది! నిజమే. తన సంగతి సరే! కరుణాకర్ నీ పిల్లలేం చేస్తున్నారనైనా అడగలేదేంటి అనైనా తనకు అప్పుడే ఎందుకు తోచలేదు. తన కొడుకున్నాడని ఏమైనా అనుకుంటాడైనా సంకోచించకుండా ఎలా తనకు పని పురమాయించాడు కరుణాకర్. ఎల్లయ్య మనసు వికలమైంది.

"ఆయన నన్ను మాట్లాడే అవకాశం ఎక్కడిచ్చిండు రాజేశ్వర్" అన్నాడు ఎల్లయ్య బుర్ర గోక్కుంటూ.

"అంటే అతని ప్రవర్తనలో ఉన్నతాధికారిననే బాసిజం, పెద్దరికమే తప్ప మీ మధ్య ఉండాల్సిన స్నేహం ఎక్కడుంది? ఓ అటెండర్‌కో, సబార్డినేట్‌కో పని చెప్పినట్టు మీకు పని చెప్పిండు. అంతకుమించి ఇందులో స్నేహం ఏముంది? ఇన్నాళ్లకు ఫోన్ చేసిండని మీకు లోలోపల కొంత సంతోషం ఉండొచ్చు. కాని ఆయన అవసరం కోసం వసుదేవుడు గాడిద కాళ్లు పట్టుకోలేదా అనుకొని మీకు ఫోన్ చేసి ఉంటాడు" నిర్మొహమాటంగా అన్నాడు రాజేశ్వర్.

తనను గాడిదతో పోల్చడంతో ఎల్లయ్య షాక్ తిన్నాడు. ఈ కోణం తనకు తోచనే లేదు. ఏదో తన పాత స్నేహితుడని, తనవాడని ఇంతదాకా లోలోన అభిమానం చూపుతున్నాడు. అతని దృష్టిలో ఇవన్నీ ఉత్తవే అని రాజేశ్వర్ తేల్చి చెప్పేసరికి షాక్‌తో గొంతులోని అన్నం ముద్ద పొలమారి స్వరం తప్పింది. రాజేశ్వర్ నీళ్లు తెచ్చి తల మీద చల్లాడు. నీళ్ల చల్లే అతని మూఢ విశ్వాసానికి ఎల్లయ్యకు అంత బాధలోనూ నవ్వొచ్చింది. తమాయించుకొని నవ్వాడు. "వాడి దృష్టిలో నేను గాడిదనే అంటావు?" అన్నాడు ఎల్లయ్య.

"గాడిద కాకపోతే హైక్లాస్ మీల్స్ దొరికే హోటల్ మీరు లేదా కిరాయి పారేస్తే దొరికే ఏసీ టాటా ఇండికా కారు మీరు. పైసలిస్తాం, తింటాం, పోతాం అని అనుకుని ఉంటడు. అన్నట్టు- ఈ పెళ్లి సెటిల్ అయితే మీకు ఎంతో విలువైన ప్రజెంటేషన్ కూడా ఇవ్వొచ్చు వ్యాపారంలో కమీషన్ లాగా. ఆ మర్యాదలకేం లోటుండదు. కానీ నిజంగా మీ మధ్య అతనింకా స్నేహం ఫీలైతే ఫోన్‌లో కుశలమడిగి అడ్రసు తెల్సుకొని, అపాయింటుమెంటు తీసుకొని కుటుంబసమేతంగా మీ ఇంట దిగేవాడు. కుటుంబ విశేషాలన్నీ కలబోసుకున్నాక పెళ్లి విషయం కదిపేవాడు. అది కూడా సంబంధం వెతికే స్వార్థమే గాని దీనికన్నా అది కాస్త బెటర్‌గా మీరు చెప్పుకోవడానికైనా చూసేవాళ్లకైనా హుందాగా ఉండేది" అన్నాడు రాజేశ్వర్.

"ఈసారి వస్తానన్నాడు గదా. నేను కూడా ఆయనకు ఇంట్లో కాకుండా హోటల్లో భోజనం పెట్టిస్తా. వాడి తిక్క తిరుగుతుంది" అన్నాడు ఎల్లయ్య.

"మీకా ఛాన్సే ఇవ్వడు సార్. దిగి ఏసి లాడ్జిలో రూం తీసుకొని ఫోన్ చేసి మీమ్మల్నే అక్కడికి పిలిపించుకుంటాడు. తనతో పాటు హోటల్లో భోంచేయమని మీ మీద బోలెడు ప్రేమ ఒలకపోస్తడు" అంటూ చేయి కడుక్కున్నాడు రాజేశ్వర్.

"ఎంత చక్కగా మనుషుల్ని అంచనా వేస్తవు రాజేశ్వర్! నాకేమో ప్రతి మనిషీ మంచి ఆలోచనతోనే వస్తాడని భ్రమ" అంటూ ప్రశంసించాడు ఎల్లయ్య.

ఆ ప్రశంసతో ఉత్సాహం పుంజుకొని అసలు విషయం చెప్తున్నట్టు అన్నాడు రాజేశ్వర్-

"ఆడపిల్ల తండ్రి గాబట్టి ఆయింత ఫోన్ చేసిండు సార్. లేకపోతే మిమ్మల్ని ఎందుకు దేకుతడు. ఆ అమ్మాయి కన్నా వాళ్ల కొడుకు మూడేండ్లు పెద్దోడంటున్నారు. ఆ కొడుక్కు కూడా మిమ్మల్నే సంబంధం చూడుమని మీకు ఎందుకు చెప్పలేదో చెప్పండి సార్"

నిలదీసినట్టు అడగడంతో గతుక్కుమన్నాడు ఎల్లయ్య. వాస్తవాలు ఎంత కఠినంగా ఉంటాయి! పచ్చి స్వార్థంతో తనను వాడుకోవడానికి ఫోన్ చేస్తే ఆయనేదో పాత స్నేహితుడు గదా అని ఇంతదాకా ఫీలవుతున్నాడు. నిజానికిలా ఆత్మీయత ఫీలవాల్సిందంటూ అతనికీ తనకూ మధ్య ఏదీ లేదని రాజేశ్వర్ కుండబద్దలు కొట్టినట్టు స్పష్టం చేస్తున్నాడు.

"మనుషులు గిట్ల తయారవుతున్నారు" అంటూ తిన్న టిఫిన్ బాక్సును కడుక్కోవడానికి లేచాడు ఎల్లయ్య.

"మార్కెట్ ఎకానమీ అంటే ఇదే సార్! మనుషుల్ని, మావన సంబంధాల్ని కూడా సరుకుల్లా అవసరమైనప్పుడు కొనుక్కొని వాడుకొని వదిలేసే సంస్కృతి ఇది. ఈ సిద్ధాంత పాఠాలు మీరే చెబుతారు. మీ సంబంధాల్ని మాత్రం అట్లా విశ్లేషించుకోరేం? దీన్ని మీరు ప్రేమ, స్నేహం అని మోసపూరిత అనుబంధాల రూపం అద్దుతారు" అన్నాడు రాజేశ్వర్.

ఆవులిస్తే పేగులు లెక్కించే రాజేశ్వర్‌ను చూస్తే కాస్త భయం, కాస్త గర్వం కలిగింది ఎల్లయ్య మనసులో. ఖాళీ బాక్సు కడుక్కొని వచ్చి అతన్ని బాగా మెచ్చుకున్నాడు ఎల్లయ్య. బెల్లు మోగడంతో క్లాసుల్లోకి నడిచారు.

సాయంత్రం ఇంటికి చేరాక రిఫ్రెష్ అయి ఓ చాయ్ లాగించి భార్య లక్ష్మితో ముచ్చట్లకు దిగాడు ఎల్లయ్య. ఎంతైనా పాత స్నేహితుడు. ఆ సంబంధం కలిస్తే తన దరిద్రాలన్నీ పోతాయి. యూనియన్ అంటూ తిరిగి ఉన్న జీతంలోంచే ఖర్చులు పెట్టుకున్నాడు. జీతంలో మిగుల్చుకున్నదంటూ లేదు. ఈ సంబంధం కుదిరితే తను బాగుపడక పోయినా తన కొడుక్కు మంచి జీవితం ఏర్పడుతుంది అని ఆలోచన. రాజేశ్వర్ అన్న మాటలన్నీ తన అవసరం కోసం పక్కకు నెట్టేశాడు ఎల్లయ్య.

అవుననలేక కాదనలేక లక్ష్మి నానుస్తూ అంది-"చేసుకుంటే మంచిగనే ఉంటది. కాని మనకిస్తరా. అయినా గంత సంపాదన ఉన్న ఇంట్ల పెరిగిన పిల్ల మన ఇంట్ల నెగులతదా!" అలా అంటూ ముక్కిరిసింది.

"పెళ్లయినంక ఇంటికాడ ఎవరుంటున్నరు. ఎవరి ఉద్యోగం కాడికి వాళ్లు తోల్కపోతనే ఉండిరి"- అన్నాడు ఎల్లయ్య ఆశ చావక.

"మీ లాంటివాళ్లే కరుణాకర్ వంటి వాళ్ల అవకాశవాదానికి, స్వార్థానికి ప్రేమ, స్నేహం, కులం, కులసంబంధాలు అని విలువనిస్తున్నరు" అని రాజేశ్వర్ అన్నట్టుగా ఉలిక్కిపడి అటూఇటూ చూశాడు ఎల్లయ్య. ఇక్కడ లక్ష్మి తప్ప ఎవరూ లేరు. ఎందుకులే పురుషోత్తంనే అడుగుదామని బయలుదేరాడు ఎల్లయ్య. పురుషోత్తం అప్పటికి ఇంకా ఇంటికి రాలేదు. పొద్దున వచ్చిన సంబంధం వివరాలు చెప్తూ సునందతో ముచ్చట్లలో పడ్డాడు ఎల్లయ్య. రాత్రి ఎనిమిదింటికి వచ్చాడు పురుషోత్తం. వెంట ఏవో కాగితాలు తెచ్చాడు. పురుషోత్తం రిఫ్రెష్ అయి కూర్చున్నాక మరోసారి వివరాలు చెప్పి తాను రాసిన కరుణాకర్ కూతురి బయోడేటా అందించాడు ఎల్లయ్య. పురుషోత్తం తన కొడుకు బయోడేటా ఎల్లయ్య చేతికిచ్చాడు. చక్కగా కంప్యూటర్‌లో టైపు చేయించి తెచ్చినట్టున్నాడు. పేరు, తండ్రి పేరు, పుట్టిన తేదీ, సమయం, ఎత్తు, కలర్, క్వాలిఫికేషన్స్, కుటుంబ సభ్యుల వివరాలు, చేస్తున్న ఉద్యోగం, సంప్రదించాల్సిన అడ్రసు, ఫోన్ వగైరాలన్నీ ఉన్నాయి అందులో.

"మొత్తానికి పెళ్లి కూడా ఉద్యోగం తీరే అప్లికేషన్లు, బయోడేటాలమయమై పోయింది" అన్నాడు ఎల్లయ్య నవ్వుతూ.

"పెళ్లి అనేది ఉద్యోగం కన్నా ఎక్కువ కదా బావా. ఉద్యోగాలు ఎన్నైనా చేయొచ్చు, వదిలేయొచ్చు. నచ్చని ఊరైతే ట్రాన్స్‌ఫర్ చేయించుకోవచ్చు. ఈ పెళ్లి సంబంధాలు, వారి బంధువుల్ని అలా చేయలేం గదా. అందుకని ఉద్యోగానికి కావాల్సిందాని కన్నా ఎన్నో రెట్లు వివరాలు, ఇంటర్వ్యూలు, జాగ్రత్తలు అవసరం"

"మ్యారేజెస్ ఆర్ మేడిన్ కట్నం, కులం, స్టేటస్, జాబ్, అన్నది ఇప్పుడు మన జీవితాల్లో ఆచరణకొస్తున్నది" అన్నాడు ఎల్లయ్య.

"అయినా వాడు ఇపుడే పెళ్లి వద్దంటున్నాడు. స్టేట్స్‌కు పోయి వచ్చినంక చేసుకుంట అంటుండు" అన్నాడు పురుషోత్తం.

ఎలాగోలా పురుషోత్తం, సునందలు కొడుకును పెళ్లికి ఒప్పించడానికి సిద్ధం చేసి ఆదివారం ఎటూ పోకుండా ఉండేట్టు ఒప్పించాడు ఎల్లయ్య.

ఆదివారం పొద్దున్నే ఎల్లయ్య కరుణాకర్ రాక కోసం చూస్తున్నాడు. వచ్చేవాళ్లకనువుగా గదంతా సర్దాడు. పొద్దున ఎనిమిదికి కరుణాకర్ ఇంటి నుంచి ఫోన్ వచ్చింది. కరుణాకర్ భార్య ఆ ఫోన్ చేసింది.

"సారీ అండీ! ఆయనకు అనుకోకుండా టూర్ పడింది. నిన్న రాత్రే వెళ్లారు. రావడం లేదని మీకు ఫోన్ చేయమన్నారు" అంటూ ఫోన్ పెట్టేసింది. వేరే సంబంధం ఇంకాస్త మంచిది దొరికిందేమో అనుకుని ఎల్లయ్య ఆ విషయం మర్చిపోయాడు.

నెలదాకా అనుకున్న సంబంధాలేవీ సెటిల్ కానట్టున్నాయి. ఆ మాట చెప్పలేక ఇలా చెప్పారేమోలే అనుకున్నాడు ఎల్లయ్య. నెల తరవాత కరుణాకర్ మళ్లీ ఫోన్ చేశాడు. ఎలాగైనా ఆ సంబంధం సెటల్ అయ్యేట్టు చూడాలంటూ. మంచి సంబంధాలు చూడమని మరీమరీ చెప్పాడు.

ఎల్లయ్య కరుణాకర్ కూతురు కోసం సంబంధాలు వెతుకుతూనే ఉన్నాడు. పురుషోత్తం కొడుకు స్టేట్స్‌కు వెళ్లాక ఆర్నెల్లకు సంబంధాలు చూడ్డానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. ఎల్లయ్య కొడుకు బెంగుళూర్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగంలో చేరాడు.

పురుషోత్తం కొడుక్కో తన కొడుక్కో ఎవరో ఒకరికి ఈ సంబంధం ఇక ఖాయం అనుకుని హైద్రాబాద్ వెళ్లాడు ఎల్లయ్య.

ఆటో వేసుకొని ఆయాసపడుతూ ఇంటికి వెళ్లాక తెలిసింది. అప్పటికి కరుణాకర్ కూతురుకు పెళ్లయిపోయి స్టేట్స్‌కు వెళ్లి వారమైపోయింది. "ఆఘమేఘాల మీద అర్జంటుగా అన్నీ జరిగిపోయాయి. సారీ! పెళ్లి పత్రికలు కూడా సరిగ్గా పంచలేకపోయిన" అన్నాడు కరుణాకర్. పెళ్లి ఫొటోల ఆల్బం ముందు పెట్టాడు. తమ హోదా ఏమిటో చూపించడానికి అన్నట్టుగా.

ఆల్బం అటూ ఇటూ తిరిగేసి చాలా అవమానంగా ఫీలయి ఇల్లు చేరాడు ఎల్లయ్య. ఎన్ని రోజులు, ఎన్ని ఫోన్ బిల్లులు ఖర్చు చేసి వీళ్ల పెళ్లి సంబంధాల కోసం కాలికి బలపం కట్టుకుని తిరిగాడో గుర్తుకొచ్చాయి.

బాధగా పురుషోత్తంతో అదే విషయం చెప్పాడు ఎల్లయ్య.

"జీవితాలు కలిసి పంచుకుంటామని ఆలోచించినవాళ్లు కనీసం పెళ్లి పత్రికైనా

పంపలేదు, బావా! అదీ మీ ఫ్రెండ్ సంస్కారం, సభ్యత. నువ్వు తెచ్చింది అంత గొప్ప సంబంధం మరి" అంటూ నవ్వేశాడు పురుషోత్తం.

మర్నాడు స్కూల్లో రాజేశ్వర్ మరీ ఎగతాళి చేశాడు.

"కరివేపాకు ఉడికేదాకా ఉంచుకొని తిన్నాక తీసేస్తారు. మీ స్నేహ సంబంధం కరివేపాకు కన్నా హీనమైపోయింది సార్. దటీజ్ యుటిలిటీ ఆఫ్ మార్కెట్ ఎకానమీ థియరీ" అంటూ నవ్వాడు.

"ఇక ఎవరికీ పెళ్లి సంబంధాలు చూడను" భీష్మించాడు ఎల్లయ్య.

"అది మీ చేతుల్లో లేదు సార్... పెళ్లిలో కట్నకానుకల్లాగే, పెళ్లి పెళ్లిపిల్లల్లాగే మీ స్నేహాల్ని కొంటారు, అమ్ముతారు. అదంతా మీకు తెలియకుండానే జరిగిపోతుంది" అన్నాడు రాజేశ్వర్.

ఎల్లయ్య దీర్ఘంగా నిట్టూర్చాడు. ఆ తర్వాత నవ్వేశాడు బతుకులో వస్తున్న మార్పులు చూసి.

కొడుకు తనంత చదువుకున్న అమ్మాయే కావాలనడంతో ఎంత వెతికినా కనుచూపు మేరలో అలాంటి సంబంధం తన స్థాయికి కనపడలేదు. పురుషోత్తం, ఎల్లయ్య తమ కొడుకుల కోసం వధువు కావాలంటూ పత్రికల్లో వేర్వేరు ప్రకటనలు ఇచ్చారు. ఇంటి అడ్రసులు ఇవ్వకుండా బాక్సు నంబర్లివ్వడంతో పదిహేను రోజులకు పత్రిక నుండి వచ్చిన లెటర్స్‌ను ఆత్రంగా చూశారు.

ఒక్కరే రెండు ఉద్యోగాలకు అప్లై చేసినట్లుగా రెండు బాక్సు నెంబర్లకు కూడా అప్లై చేసినవే ఎక్కువ.

అందులో కరుణాకర్ రెండో కూతురు బయోడాటా ఇద్దరికీ రావడం చూసి అవాక్కయ్యారిద్దరూ. రెండో కూతురు గురించి కరుణాకర్ ఒక్కనాడూ చెప్పలేదేమిటా అని అనుకున్నారు.

రాజేశ్వర్ కిసుక్కున నవ్వినట్టనిపించి అటుకేసి చూశారు. "నమస్కారం సార్! రాజేశ్వర్" అంటూ అప్పుడే ఇంట్లోకి వస్తున్నాడు.

**ఈనాడు ఆదివారం, 5 నవంబరు 2000**